# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ:  18-10-2024                                  సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రపతి  ద్రౌపది ముర్ము విదేశీ పర్యటనలో భాగంగా మలావి దేశ అధ్యక్షులు లాజరస్ చక్వేరాతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు.
- ❖ బ్రిక్స్ సభ్య దేశాల సదస్సులో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 22వ తేదీ నుంచి రెండు రోజుల పాటు రష్యాలో పర్యటించనున్నారు
- ❖ దేశ రక్షణ రంగాన్ని మరింత వినూత్నంగా, సాంకేతికత ఆధారితంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- ❖ పార్లమెంట్‌లో చర్చలు, ప్రసంగాల రికార్డుల నిర్వహణ కోసం సాంకేతికత, కృత్రిమ మేధస్సును ఉపయోగించాల్సిన అవసరం ఉందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు.
- ❖ ఝార్ఖండ్ రాష్ట్రంలో తొలి దశ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం ఈరోజు నోటిఫికేషన్ విడుదల చేసింది.

============================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విదేశీ పర్యటనలో భాగంగా మలావి దేశ అధ్యక్షులు లాజరస్ చక్వేరాతో ఈరోజు ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రపతి జరిపిన ప్రతినిధి స్థాయి చర్చలలో కళ, సంస్కృతి, క్రీడలు, యువజన వ్యవహారాలు, ఫార్మా రంగాలకు సంబంధించిన 4 అవగాహన ఒప్పందాలపై (MOUలు) సంతకాలు చేశారు. అలాగే ఆ దేశానికి వెయ్యి మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. మలావిలోని జాతీయ యుద్ధ స్మారకాన్ని కూడా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందర్శించారు.

============================

బ్రిక్స్ సభ్య దేశాల 16వ సదస్సులో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 22వ తేదీ నుంచి రెండు రోజుల పాటు రష్యాలో పర్యటించనున్నారు. ప్రపంచ సమస్యలను చర్చించడానికి కజాన్ లో జరిగే ఈ సదస్సు బ్రిక్స్ దేశాల నాయకులకు ఒక ముఖ్య వేదిక కానుందని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. బ్రిక్స్ కార్యక్రమాల పురోగతి, భవిష్యత్ సహకారం తదితర అంశాలను చర్చించడానికి బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలకు ఈ సదస్సు అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపింది. ఈ పర్యటనలో భాగంగా బ్రిక్స్ సభ్య దేశాలకు చెందిన నేతలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహిస్తారని విదేశాంగ శాఖ ప్రకటనలో పేర్కొంది.

=============================

దేశ రక్షణ రంగాన్ని మరింత వినూత్నంగా, సాంకేతికత ఆధారితంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన “డేర్ టు డ్రీమ్ 5.0 ఇన్నోవేషన్ కాంటెస్ట్”లో పాల్గొన్న కేంద్రమంత్రి మాట్లాడుతూ... సంప్రదాయేతర యుద్ధం రక్షణ రంగంలో కొత్త సవాళ్లను తీసుకువచ్చిందని అన్నారు. రక్షణ రంగంలో ఆవిష్కరణలు, పరిశోధనల అభివృద్ధి ఎంతో అవసరమని పేర్కొన్నారు. మరోవైపు సాంకేతికత కారణంగా ఆయుధాలు, పరికరాలు పెను మార్పులకు గురవుతున్నాయని, నిరంతర అభివృద్ధికి కృషి చేస్తూ.. విఘాతం కలిగించే సాంకేతికతలపై దృష్టి సారించాలని కేంద్రమంత్రి సూచిస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

=============================

దేశంలో బాల్య వివాహాల నిర్మూలనకు సుప్రీమ్ కోర్టు మార్గదర్శకాలను జారీ చేసింది. వ్యక్తిగత చట్టంతో సంబంధం లేకుండా బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి వివాహాలతో మైనర్లకు వారి జీవితాన్ని ఎంచుకొనే స్వేచ్ఛను ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించింది. బాల్యవివాహాల నిరోధం, మైనర్ల రక్షణపై అధికారులు దృష్టిసారించాలని, చివరి ప్రయత్నంగా నిందితులకు జరిమానా విధించాలని తెలిపింది.

=============================

కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ ఈ రోజు శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. ప్రశాంతి నిలయంలోని పవిత్ర ప్రాంగణంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ కేంద్ర మంత్రికి స్వాగతం పలికి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా భగవాన్ సత్యసాయి సందేశాలు సేవా, ప్రేమ అనేవి అందరికీ సమానమేనని గుర్తు చేస్తాయని.. ఇవి ప్రతీ ఒక్కరినీ ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు.

=============================

ఝార్ఖండ్ రాష్ట్రంలో తొలి దశ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం ఈరోజు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ దశలో 43 నియోజకవర్గాలకు నవంబర్ 13వ తేదీన పోలింగ్ జరగనుంది. కాగా అభ్యర్థుల నామినేషన్ల దాఖలుకు ఈనెల 25 చివరి తేదీ. 28న నామినేషన్ల పరిశీలన, 30న ఉపసంహరణకు చివరి తేదీ అని తెలిపింది. ఝార్ఖండ్‌లో 2 దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండగా, 2వ దశ పోలింగ్ నవంబర్ 20న జరగనుంది. 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

=============================

ఆన్‌లైన్ మోసాలను అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం, మెటా సంయుక్త ఆధ్వర్యంలో “స్కామ్ సే బచో" పేరుతో ప్రచారాన్ని చేపట్టాయి. ఢిల్లీలో ఈరోజు జరిగిన ప్రచార ప్రారంభ కార్యక్రమం సందర్భంగా కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ... ఆన్‌లైన్ మోసలు పెరుగుతున్న నేపథ్యంలో వాటి నుండి పౌరులను రక్షించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. డిజిటల్ భద్రత, విజిలెన్స్, సంస్కృతిని

పెంపొందించడానికి ప్రభుత్వ చేస్తున్న కృషిని ఇది  ప్రతిబింబిప చేస్తుందని పేర్కొన్నారు. 900 మిలియన్లకు పైగా ఇంటర్నెట్ వినియోగదారులతో భారతదేశం డిజిటల్ ఇండియా కింద వృద్ధిని సాధించిందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

==============================

రానున్న 3, 4 రోజుల్లో తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కర్ణాటక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. అలాగే ఈ నెల  20, 21వ తేదీలలో అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. పశ్చిమ బెంగాల్,  ఒడిశా రాష్ట్రాల్లో కూడా 23, 24వ తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

==============================

పార్లమెంట్‌లో చర్చలు, ప్రసంగాల రికార్డుల నిర్వహణ కోసం సాంకేతికత, కృత్రిమ మేధస్సును ఉపయోగించాల్సిన అవసరం ఉందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. జెనీవాలో జరిగిన ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ (ఐపీయూ) 149వ అసెంబ్లీ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఈరోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓం బిర్లా మాట్లాడుతూ... హరిత, సాంకేతికతతో నడిచే కాగిత రహిత పార్లమెంటు రూపకల్పనకు  భారతదేశం చూపుతున్న చొరవను ప్రపంచ పార్లమెంటరీ ప్రశంసించిందని ఆయన పేర్కొన్నారు. సాంకేతికత వినియోగంలో భారత్ పురోగతిని సాధిస్తుందని స్పీకర్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

బెంగళూరు వేదికగా భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ క్రికెట్ మ్యాచ్ మూడవ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ రెండవ ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. అంతకుముందు ఆట ప్రారంభించిన న్యూజిలాండ్ 402 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీనితో ఆట ముగిసే సమయానికి భారత్ ఇంకా 125 పరుగుల వెనుకంజలో ఉంది.

==============================

ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80 వేల 749.26 పాయింట్ల వద్ద ప్రారంభమై చివరకు 218 పాయింట్ల లాభంతో 81 వేల 224.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 104 పాయింట్లు పెరిగి 24 వేల 854 పాయింట్లతో ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.06గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.43 డాలర్లు, బంగారం ఔన్సు 2 వేల, 726 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి.

==============================
==============================